క్లుప్తంగా

అధ్యయనంతో లక్ష్య సాధన



కాజీపేట అర్బన్: ప్రణాళికతో కూడిన అధ్యయనంతో లక్ష్య సాధన సులభం అని మామునూరు పోలీస్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. హనుమకొండ లష్కర్ బజార్‌లోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న ఎస్సై, పీసీ, గ్రూప్ –2 విద్యార్థులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోటీ పరీక్షల్లోని సిలబస్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బీసీ స్టడీ సర్కిల్ అందజేస్తున్న ఉచిత శిక్షణను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీవీ ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థి ప్రతిభ



కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఏ రెండో సంవత్సరం చదువుతున్న పి.మానస్విత.. గత నెల18 నుంచి 24వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్ బిలాస్‌పూర్‌లోని గురుగాస్ సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొని భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు అనే అంశంపై చేపట్టిన కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈమేరకు హనుమకొండలోని కళాశాలలో విద్యార్థిని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య, అధ్యాపకులు శనివారం అభినందించారు.

సత్యనారాయణకు డాక్టరేట్




కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మ్యాథ్స్ విభాగంలో పరిశోధకుడు అనుమల్ల సత్యనారాయణకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. రిలియబులిటీ అనాలసిస్ ఆఫ్ స్ట్రక్చరల్ మెంబర్స్ ఫర్ స్ట్రెంథ్ ఆఫ్ మెటీరియల్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సత్యనారాయణకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం డాక్టర్ ఎం.తిరుమలాదేవి పర్యవేక్షణలో సత్యనారాయణ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

బీజేపీయే ప్రత్యామ్నాయం



కాజీపేట: బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనని పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. 62వ డివిజన్ పరిధిలోని విష్ణుపురి, న్యూ సోమిడి ప్రాంతాల్లో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో చిర్ర నర్సింగ్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు భగవాన్‌దాస్ ఉపాధ్యాయ, ఆకుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

కల్వర్టు పనుల పరిశీలన



కాజీపేట: కాజీపేట జూబ్లీమార్కెట్ వద్ద చేపడుతున్న కల్వర్టు నిర్మాణ పనులను కార్పొరేటర్ విజయశ్రీరజాలీ శనివారం పరిశీలించారు. చిన్నపాటి వర్షానికే జూబ్లీ మార్కెట్ నీట మునుగుతుండగా సమస్య తీవ్రతను స్థానిక ఎమ్మెల్యే చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, కమిషనర్ ప్రావీణ్య దృష్టికి కార్పొరేటర్ తీసుకెళ్లారు. ఈమేరకు కల్వర్టు పనులు ప్రారంభం కాగా, కార్పొరేటర్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

ఢిల్లీకి తరలిన నాయకులు



కాజీపేట రూరల్ / న్యూశాయంపేట: తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం (టీఎంకేఎంకేఎస్) నాయకులు కాజీపేట జంక్షన్ నుంచి తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో శనివారం ఢిల్లీకి తరలివెళ్లారు. 3వ తేదీన ఢిల్లీలో జరగనున్న బహిరంగ సభకు తరలివెళ్తున్నట్లు ఆ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్, జిల్లా ఉపాధ్యక్షుడు బొజ్జం స్వామి, పిట్టల రవి, జిల్లా నాయకులు రాజ్‌కుమార్, జె.దుర్గయ్య, సమ్మయ్య, ప్రశాంత్‌తో పాటు మరో 18 మంది ఢిల్లీకి తరలివెళ్లారు.

చిరుధాన్యాల్లో పోషకాలు మెండు



హసన్‌పర్తి: మాట్లాడుతున్న సబిత



న్యూశాయంపేట: కిట్లు అందిస్తున్న రిజ్వానా



ప్రతిజ్ఞ చేస్తున్న కార్పొరేటర్, అంగన్‌వాడీ టీచర్లు

హసన్‌పర్తి: చిరుధాన్యాల్లో అనేక రకాల పోషకాలు అధికంగా ఉంటాయని హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారి సబిత తెలిపారు. పోషక పక్వాడ్‌లో భాగంగా ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో హసన్‌పర్తి మండల స్థాయి సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలకు అన్ని రకాల పోషక కార్యక్రమాలు చేపట్టాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. పోషకాహార లేమి, తక్కువ బరువుతో శిశువు జననం, గర్భిణులు, బాలికల్లో రక్తహీనత లోపం శాతాన్ని పెంచడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఇంటింటికీ వెళ్లి పోషకాహార కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతపాక సునీత, జెడ్పీటీసీ సభ్యురాలు రేనుకుంట్ల సునీత, కార్పొరేటర్లు గురుమూర్తి శివకుమార్, జక్కుల రజిత, దివ్యారాణి, సీడీపీఓ స్వరూప, డాక్టర్ వాణిశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు కీరిట, అనిత, స్వరూప, కమల తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

న్యూశాయంపేట: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ సూచించారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని 36వ డివిజన్ చింతల్ అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆరోగ్య తెలంగాణ, ఆరోగ్య భారత్ నిర్మిద్దామని మహిళలతో ప్రార్థన చేయించారు. అనంతరం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆర్పీలు, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పలు డివిజన్లలో..

ఖిలా వరంగల్: పౌష్టికాహారంతో పిల్లలు, పెద్దలు ఆరోగ్యంగా ఉంటారని కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, బైరబోయిన ఉమ, వేల్పుగొండ సువర్ణ, ముస్కమల్ల అరుణ, మరుపెల్లి రవి అన్నారు. పోషణ పక్షంలో భాగంగా వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలోని 32, 33, 34, 37, 38, 39, 41, 42, 43 డివిజన్లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వేర్వేరుగా పోషణ్ అభియాన్ అవగాహన సదస్సులు శనివారం జరిగాయి. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, కేడల జనార్దన్, సిద్దం రాజు, అరుణ విక్టర్, స్వర్ణలత, శోభ, రమాదేవి పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీతో క్యాన్సర్ అంతం



శిబిరంలో పాల్గొన్న శరత్‌బాబు, తదితరులు

ఖిలా వరంగల్: క్యాన్సర్ అనగానే భయాందోళన చెందవద్దని, ఆధునిక టెక్నాలజీతో దాన్ని అంతం చేయవచ్చని రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ పూర్వ గవర్నర్ ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ శరత్‌బాబు అన్నారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ వరంగల్ సంయుక్త ఆధ్వర్యంలో మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై డాక్టర్ హరిరమాదేవి, అసిస్టెంట్ గవర్నర్ రామగిరి రవీందర్, అధ్యక్ష, కార్యదర్శులు దీకొండ నర్సింహారావు, అనంతుల కుమారస్వామి, కోశాధికారి ఎల్లరాజు, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ వరంగల్ అధ్యక్ష, కార్యదర్శులు బండారి భార్గవి, సుమన్ మాన్యార్‌లతో కలిసి ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పేద మహిళల ఆరోగ్య భద్రతకు రోటరీ క్లబ్ అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నంబూరి లావణ్య, రాజగోపాల్, ఎల్లంకి రాజయ్య, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, శివప్రసాద్, మదన్, కుడికాల వెంకటేశ్వర్లు, తోనుపునూరి వెంకటేశ్వర్లు, కనకయ్య, తోట వైద్యనాథ్, శ్రీకాంత్, జి.సురేష్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్లకు ఘన స్వాగతం



కాజీపేట రూరల్ / మడికొండ: సైన్యంలో 20ఏళ్లకు పైగా దేశానికి సేవలందించి బెంగళూర్ నుంచి రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో కాజీపేట జంక్షన్‌కు చేరుకున్న ఆర్మీ జవానులు కరీంనగర్ జిల్లాకు చెందిన కనకం సంపత్, వీణవంకకు చెందిన గాజుల సమ్మయ్య, మంచిర్యాలకు చెందిన రావుల కిరణ్‌కుమార్, మహబూబాబాద్‌కు చెందిన లునావత్ సురేష్ లకు స్థానిక నాయకులు పూలమాలలతో ఎదిరేగి స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ర్యాలీగా మడికొండకు చేరుకుని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి జవాన్లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ర్యాలీలో వస్కుల శంకర్, వస్కుల వెంకటస్వామి, మాడుగుల శ్రీకాంత్, శివ, అనిల్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి సెల్‌కు రెండు ఫిర్యాదులు

వరంగల్ రూరల్: మిషన్ భగీరథ వరంగల్ సర్కిల్ కార్యాలయంలో శనివారం నీటి ఎద్దడి నివారణకు మిషన్ భగీరథ వరంగల్ సర్కిల్ కార్యాలయం పర్యవేక్షక ఇంజనీర్ కె.రాములు మానిటరింగ్ సెల్‌ను ప్రారంభించారు. ఈ సెల్‌కు వరంగల్ నగరంలోని శివనగర్, రంగశాయిపేట ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఉందని రెండు ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని ప్రజలెవరికైనా నీటి సమస్యలు తలెత్తితే మానిటరింగ్ సెల్ 96765 56063 లో ఫిర్యాదు చేయవచ్చని కె.రాములు తెలిపారు.

అసమర్థుల పాలనలో అభివృద్ధి శూన్యం



కరపత్రం అందజేస్తున్న కొండా సురేఖ

ఖిలా వరంగల్: గత నాలుగేళ్లుగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అసమర్థుల నాయకత్వంలో అభివృద్ధి ఏమీ జరగలేదని కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు, మాజీ మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా వరంగల్ 34 డివిజన్ శివనగర్‌లో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆధ్వర్యంలో శనివారం జోడో పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ తూర్పులో సామాన్య ప్రజలకు రక్షణ కరువైందని అన్నారు. నాయకులు ధిక్కార స్వభావాన్ని వీడి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారని తెలిపారు. 2014 నుంచి 2018 వరకు తాము తెచ్చిన నిధులు, చేసిన అభివృద్ధి తప్ప ఏమీలేదని ఎద్దేవాచేశారు. శివనగర్, బొర్రయ్య వీధి, సత్యనారాయణ వీధి, వందన స్కూల్‌లేన్ మీదుగా చైత్యరథ గార్డెన్ వరకు పాదయాత్ర సాగింది. కార్యక్రమంలో నాయకులు నల్గొండ రమేష్, మీసాల ప్రకాష్, కరాటే ప్రభాకర్, చిట్టిమల్ల శ్రీనివాస్, శేర్ల కిషోర్, నారగోని స్వప్న, సందీప్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 2మి.మీ వర్షపాతం

వరంగల్ రూరల్: వరంగల్ జిల్లాలో శనివారం 2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వరంగల్ జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి గుర్రాల జీవరత్నం తెలిపారు. వర్ధన్నపేట మండలంలో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది. రాయపర్తి మండలంలో 0.4 మిల్లీ మీటర్లు, సంగెం మండలంలో 0.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం



ప్రిన్సిపాల్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న చంద్రశేఖర్

ఖిలా వరంగల్: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని లయన్స్ ఇంటర్నేషనల్ 320–ఎఫ్ సెకండ్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్యా, లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ వారియర్స్ అధ్యక్షుడు మండల పరశురాములు, కార్యదర్శి కొండ్రెడ్డి నవీన్ కుమార్‌రెడ్డి అన్నారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఏఎస్‌ఎం మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ ఆధ్వర్యంలో ఏఎస్ఎం కళాశాల ప్రిన్సిపాల్ సుకుమారి అధ్యక్షతన సమాజాభివృద్ధి – యువత పాత్రపై అనే అంశంపై శనివారం అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ సమాజం నుంచి యువత చాలా విషయాలు నేర్చుకోవాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వనరులను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులకు ఏఎస్ఎం కళాశాల వారియర్స్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బి.రవి, ప్రభాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోస్ట్‌మెన్ అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ 36వ డివిజన్ చింతల్ ప్రాంతంలో నివాసముంటూ పోస్ట్‌మెన్‌గా పనిచేస్తున్న ఓ యువకుడు అదృశ్యమైనట్లు మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపారు. భూపాలపల్లి జిల్లా కాటారం గ్రామానికి చెందిన రాగుల లక్ష్మణ్ (30) వెంకటాపురం గ్రామంలో పోస్ట్‌మెన్‌గా పనిచేస్తున్నారు. నాలుగేళ్లుగా వరంగల్ చింతల్ ఏరియాలో ఓ గదిని అద్దె తీసుకుని పోస్ట్‌మెన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. గతనెల 25 నుంచి లక్ష్మణ్ విధులకు వెళ్లడం లేదు. అన్ని చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో లక్ష్మణ్ తండ్రి రాగుల బొందయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు శనివారం తెలిపారు.

వలంటీర్లకు అధికారుల సన్మానం



వలంటీర్లను అభినందిస్తున్న రైల్వే అధికారులు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని పురాతన రైల్వే దేవాలయ సముదాయం కమిటీ బృందం సేవలకు రైల్వే అధికారులు కొనియాడారు. ఈ మేరకు బృందం సభ్యులను శనివారం సన్మానించారు. గురు, శుక్రవారాల్లో శ్రీరామనవమి వేడుకలు, వీరాంజనేయస్వామి సువర్చలదేవి కల్యాణం, రమాసహిత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతం, మహా అన్నదానంలో సేవలందించిన ఆలయ కమిటీ సభ్యులు, స్కౌట్ అండ్ గైడ్స్, రైల్వే పోలీసులు, అర్చకులను కాజీపేట రైల్వే అధికారులు అభినందించారు. కార్యక్రమంలో అర్వపల్లి ఆంజనేయశాస్త్రి, పొక్కునూరి హరనాథ అవధాని, వ్యాకరణం కోటేశ్వర్‌రావు, అర్వపల్లి సత్యనారాయణ, ఆలయ కమిటీ సెక్రటరి పి.భాస్కర్‌రావు, పీఎస్ఎన్.మూర్తి, టి.సత్యప్రకాష్, ఏఎస్ఆర్.ప్రసాద్‌రావు, పి.పరశురాములు, శంకర్, ఎం.మహేందర్, డి.వీరన్న, జి.భాస్కర్ పాల్గొన్నారు.

బేకరీ యజమానికి జరిమానా



వరంగల్ అర్బన్: పాడైపోయిన కేకులు విక్రయించినందుకు బేకరీ యజమానికి రూ.10 వేల జరిమానా విధించినట్లు బల్దియా ముఖ్య ఆరోగ్యాధికారి డాక్టర్ రాజేష్ తెలిపారు. కేఎంసీ ఎదురుగా గల శివనారాయణ బేకరీలో కాలం చెల్లిన కేకులు అమ్మినందుకు షాపు యజమానికి జరిమానా విధించినట్లు వివరించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రెడ్డి, శానిటరీ జవాన్ కవిత తదితరులు పాల్గొన్నారు.

వడుప్సా వరంగల్ జోన్ కార్యవర్గం



బొల్లం కనకయ్య, అధ్యక్షుడు



జన్ను విలియమ్స్, కార్యదర్శి

ఖిలా వరంగల్: వరంగల్ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (వడుప్సా) వరంగల్ జోన్ అధ్యక్షుడు బిల్లా రవి అధ్యక్షతన వడుప్సా జోన్ జనరల్ బాడీ సమావేశం వరంగల్ ఆర్టీఏ జంక్షన్ నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలోని సిల్వర్ క్రోన్ హైస్కూల్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నలంద హైస్కూల్ ప్రిన్సిపాల్ బొల్లం కనకయ్య, ప్రధాన కార్యదర్శిగా సెయింట్ జోసెఫ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ జన్ను విలియమ్స్, కోశాధికారిగా సాధన హైస్కూల్ ప్రిన్సిపాల్ కూరపాటి మోహన్, ఉపాధ్యక్షుడిగా గోమతి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కూచన క్రాంతికుమార్, ముఖ్య సలహాదారులు ఇండియన్ కిడ్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఠాగూర్ జ్ఞానేశ్వర్‌సింగ్ ఎన్నికయ్యారు. సమావేశంలో వడుప్సా జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వరరావు, రమేష్‌రావు, కె.భూపాల్‌రావు, జన్ను పరంజ్యోతి, ఆడెపు శ్యామ్, కె.శ్రీధర్, బి.వెంకటేశ్వర్లు, ఠాకూర్ జ్ఞానేశ్వర్‌సింగ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ముక్కెర రవీందర్, సతీష్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ప్రావీణ్యకు అభినందనలు



వరంగల్ రూరల్: వరంగల్ నూతన కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పి.ప్రావీణ్యకు శనివారం కలెక్టర్ కార్యాలయంలో అఖిల భారత మహాత్మాజ్యోతిరావు పూలే సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షులు కేడల ప్రసాద్, లేక్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు పెరుమాండ్ల లక్ష్మణ్ మంజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పోతన వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. ప్రజావాణి సమయాన్ని సాయంత్రం 5 గంటల వరకు పొడిగించాలని, వినతులు సత్వరమే పరిష్కరించాలని వారు కలెక్టర్‌ను కోరారు.

కుల గణన ఉద్యమంలో పాల్గొనండి



అభివాదం చేస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ: కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న కుల గణనలో బీసీలను కూడా గణించాలని చేపట్టిన ఉద్యమంలో బీసీలంతా భాగస్వాములు కావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. హనుమకొండ రాంనగర్‌లోని సంఘం జిల్లా కార్యాలయంలో సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యామ్‌యాదవ్ అధ్యక్షతన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా పులి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దేశ జనాభాలో 60 శాతం ఉన్న బీసీల జనగణనను కేంద్ర ప్రభుత్వం చేపట్టి విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 3, 4వ తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సూచించారు. బుట్టి శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ ప్రొఫెషనల్ కోర్సు చదువుతున్న బీసీ విద్యార్థులందరికీ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 16న బీసీల ఆత్మగౌరవ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు శివానంద, నాయకులు ఆకుల విజయ, హైమావతి, నాయిని సరస్వతి, చిరంజీవి, సుధాకర్, మల్లేశం, సంగినేని సురేందర్, ఎం.సురేందర్, వాల్మీకి కిరణ్, రాఖీ, విజేందర్, కార్తీక్, సిద్దార్థ్ పాల్గొన్నారు.

13న ‘ఆయురాన్వేషణ’ సెమినార్



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యులు, తదితరులు

కాశిబుగ్గ: తెలంగాణ జిజ్ఞాస ఆయుర్వేద విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13న హనుమకొండ బాలసముద్రంలోని సామా జగన్మోహన్ స్మారక భవన్‌లో ఆయురాన్వేషణ సెమినార్ నిర్వహించనున్నట్లు జిజ్ఞాస జాతీయ కో కన్వీనర్ డాక్టర్ రాజేష్ తెలిపారు. ఈమేరకు వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ జగన్మోహనచారి చేతుల మీదుగా సెమినార్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ సెమినార్‌కు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ఆయుర్వేద వైద్య నిపుణులు హాజరవుతున్నారని తెలిపారు. ఆయుర్వేద వైద్యులు, విద్యార్థులు పాల్గొని సెమినార్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్, వైద్యులు శిరీష, కేదారి, మధు, మహేష్, కవిత, ఫర్వీన్, జిజ్ఞాస నాయకులు డాక్టర్ రజనీకాంత్, డాక్టర్ దీక్ష తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

హసన్‌పర్తి: ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. నగరంలోని ఒకటవ డివిజన్ పలివేల్పులలో శ్రీవల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి దేవస్థాన ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక వికాసం కలుగుతుందని అన్నారు. ఆలయాభివృద్ధికి ఆర్థిక సహకారం అందించిన పలివేల్పులకు చెందిన గ్యాదరబోయిన పద్మ – రాజు దంపతులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు నరేడ్ల శ్రీధర్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చేరాలు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాదర్‌బాబా పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ భవనానికి నిధుల మంజూరు

నగరంలోని రెండవ డివిజన్ వంగపహాడ్‌లో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.46 లక్షలు విడుదలయ్యాయి. ఈమేరకు ప్రొసీడింగ్ పత్రాన్ని ఎమ్మెల్యే అరూరి రమేష్ శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చింతం శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్, మన బడి – మన బాధ్యత నియోజకవర్గ కన్వీనర్ దోమ కుమార్, నాయకులు బొక్క ప్రవీణ్, దోమ రాజమౌళి, మంద కిషోర్, దోమ శ్రావణ్, సిలువేరు శ్యాం, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

కిట్స్ ట్రోఫీ టోర్నమెంట్ ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి

హసన్‌పర్తి: కిట్స్ పూర్వ విద్యారుల సహకారంతో రెండు రోజుల పాటు కొనసాగనున్న కిట్స్ ట్రోఫీ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి సుమారు రెండు వందల మంది క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ చదువు ఎంత అవసరమో.. ఆటలు కూడా అంతే అవసరమని వివరించారు. కార్పొరేటర్ అభినవ్‌భాస్కర్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ముందుకొచ్చి టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల ఏఓ డాక్టర్ రమేష్‌రెడ్డి, డీసీపీ సంజీవ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాకరాచారి, ప్రొఫెసర్ వెంకటస్వామి, ప్రొఫెసర్ మహేష్, ప్రొఫెసర్ నాగరాజు, స్పోర్ట్స్ క్లబ్ విద్యార్థి ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు సౌమ్యరాజ్, ఐశ్వర్య, విద్యార్థి ప్రతినిధులు జగన్మోహన్‌రెడ్డి, జయంత్ పాల్గొన్నారు.

వరంగల్ రైల్వే స్టేషన్‌లో కోతుల బెడద

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



వరంగల్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై కోతుల గుంపు

కాశిబుగ్గ: వరంగల్ రైల్వే స్టేషన్‌లో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. దాంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. కోతుల బెడద నుంచి తమను కాపాడాలని మొరపెట్టుకున్నా రైల్వే అధికారులు స్పందించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇటీవల కాలంలో వరంగల్ రైల్వే స్టేషన్‌లో కోతుల బెడద అధికమైంది. ఈక్రమంలో ప్రయాణికుల చేతిలో తినుబండారాలు, పండ్లు, వస్తువులు ఏది కనిపించినా లాక్కెళ్తున్నాయి. గుంపులుగా సంచరించడంతో వారు భయపడుతున్నారు. ప్లాట్ ఫాంలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, నల్లాలు, ఎస్కలేటర్ల వద్ద కోతులు సంచరిస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



నల్లా వద్ద..



ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై..